సాక్షి రంగారెడ్డి

బుధవారం । 7 । మే । 2025



'లక్ష'ణమైన కాడెడ్లు!

మరో ఇరవై రోజుల్లో వానాకాలం సీజన్ ప్రారంభంకానుంది. ఈ నేపథ్యంలో కాడెడ్ల ధరలు భగ్గుమంటున్నాయి. 8లో▸



ప్రహరీ పనులు ఆపేయండి

మామిడిపల్లిలో చేపట్టిన ప్రహరీ నిర్మాణ పనులను ఆపేయాలని బీజేపీ నాయకులు డిమాండ్ చేశారు. 8లో▸



దిగుబడి తగ్గకుండా..

వేసవిలో అధిక ఉష్ణోగ్రతలు, పొడి గాలులు, జల వనరులు తగ్గడం వంటి కారణాలతో కూరగాయల దిగుబడి తగ్గుతుంది. 8లో▸

న్యూస్‌రీల్

నేడు మంత్రి శ్రీధర్‌బాబు పర్యటన

కొత్తూరు: నాట్కో ట్రస్ట్ సహకారంతో నిర్మించిన కొత్తూరు జెడ్పీహెచ్ఎస్ భవనాన్ని బుధవారం ప్రారంభించనున్నట్లు మండల విద్యాధికారి అంగూర్‌నాయక్ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరుకానున్న ఐటీ మంత్రి శ్రీధర్ బాబు ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్‌తో కలిసి పాఠశాలను ప్రారంభిస్తారని చెప్పారు.

వేసవి శిబిరాలను సద్వినియోగం చేసుకోండి

డీఈఓ సుశీంధర్‌రావు



శిబిరాన్ని పరిశీలిస్తున్న డీఈఓ సుశీంధర్‌రావు

కొత్తూరు: ప్రభుత్వ పాఠశాలల్లో నిర్వహిస్తున్న వేసవి శిబిరాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా విద్యాధికారి సుశీంధర్ రావు కోరారు. పట్టణంలోని ప్రభుత్వ పాఠశాలలో నిర్వహిస్తున్న వేసవి శిబిరాన్ని మంగళవారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు శిక్షణ ఇస్తున్న అంశాల గురించి నిర్వాహకులను అడిగి వివరాలు తెలుసుకున్నారు. శిబిరాలకు వచ్చే విద్యార్థులకు అన్ని సౌకర్యాలు, వసతులు కల్పించాలని ఉపాధ్యాయులకు సూచించారు. విద్యార్థులు ఆసక్తి ఉన్న విభాగాన్ని ఎంపిక చేసుకుని నేర్చుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎంఈఓ అంగూర్‌నాయక్, ఉపాధ్యాయులు రాజు, నవనీత, శిబిరం నిర్వాహకులు పాల్గొన్నారు.

పంచాయతీ కార్మికుల సమస్యలు పరిష్కరించండి

సంఘం రాష్ట్ర అధ్యక్షుడు నర్సింహారెడ్డి



ఎంపీడీఓకు సమ్మె నోటీసు అందజేస్తున్న ఏఐటీయూసీ నాయకులు

కొత్తూరు: పంచాయతీ కార్మికుల సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని ఏఐటీయూసీ విభాగం పంచాయతీ కార్మికుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు నర్సింహారెడ్డి డిమాండ్ చేశారు. మంగళవారం ఆయన ఈ నెల 20న చేపట్టనున్న దేశవ్యాప్త సమ్మె నోటీసును ఎంపీడీఓ అరుంధతికి అందజేశారు. అనంతరం నర్సింహారెడ్డి మాట్లాడుతూ.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పంచాయతీ కార్మికుల సమస్యలను ఏమాత్రం పట్టించుకోవడం లేదన్నారు. ప్రభుత్వాలు స్పందించి కార్మికుల సమస్యలను, డిమాండ్లను పరిష్కరించాలన్నారు. లేని పక్షంలో విడతల వారీగా దేశ వ్యాప్తంగా ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సంఘం మండల అధ్యక్షుడు శేఖర్ రెడ్డి, కార్మికులు సురేష్, దేవయ్య, బుచ్చయ్య, తదితరులు పాల్గొన్నారు.

ఎరువుల వాడకం మోతాదుకు మించొద్దు

పర్యావరణ, సహజ వనరుల విభాగం డైరెక్టర్ డాక్టర్ కేపీ వాణి



మాట్లాడుతున్న డాక్టర్ కేపీ వాణి

చేవెళ్ల: రైతులు పొలాలకు మోతాదుకు మించి ఎరువులు వాడొద్దని పర్యావరణ, సహజ వనరుల విభాగం డైరెక్టర్ డాక్టర్ కేపీ వాణి సూచించారు. మండల పరిధిలోని చనువెళ్లి గ్రామంలో మంగళవారం 'రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు' అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి హాజరైన కేపీ వాణి మాట్లాడుతూ.. రైతులు రసాయన ఎరువుల వాడకం తగ్గించాలన్నారు. పంటకాలం ముగిసే వరకు ఎరువులు, విత్తనాలు, మందులకు సంబంధించిన రసీదులు భద్రపరుచుకోవాలని చెప్పారు. సాగునీటిని ఆదా చేస్తూ పంట మార్పిడి విధానం అవలంబించాలన్నారు. అనంతరం హార్టికల్చర్ అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ డి.రజిని మాట్లాడుతూ.. కూరగాయలు, ఆయిల్‌పామ్ సాగు పద్ధతులపై అవగాహన కల్పించారు. పచ్చిరొట్ట ఎరువులతో భూసారం పెరుగుతుందని పంటల దిగుబడికి ఉపయోగపడుతుందని చెప్పారు. ఆధునిక సాంకేతిక వ్యవసాయ పద్ధతుల గురించి రైతులకు వివరించారు. ఈ సందర్భంగా రైతులు తమ సందేహాలను అధికారులను అడిగి నివృత్తి చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఏఈఓలు శంకర్‌లాల్, జి.రమ్య, రైతులు, నాయకులు పాల్గొన్నారు.

కాసుల కక్కుర్తి!

పుట్టగొడుగుల్లా వెలుస్తున్న ప్రైవేటు ఆస్పత్రులు

ప్రాణాలను కాపాడేది వైద్యం. అందుకే వైద్యులను సాక్షాత్తు నారాయణుడిగా కీర్తిస్తారు. ప్రాణదాతగా గౌరవిస్తారు. కొంత మంది వైద్యులు వృత్తి ధర్మం మరిచి కాసులకు కక్కుర్తి పడడంతో కనిపించే ఆ దైవమే వారి పాలిట శాపంగా మారుతోంది. ఇబ్రహీంపట్నంలోని వైద్యురాలి నిర్లక్ష్యంతో ఓ ఇల్లాలి మాతృత్వపు కలను చిదిమేసిన ఘటనే ఇందుకు నిదర్శనం.

- అర్హత లేని వారితో రోగులకు చికిత్సలు
- నిర్లక్ష్యంతో నిండుప్రాణాలు బలి



ఇబ్రహీంపట్నంలోని విజయలక్ష్మి ఆస్పత్రి

ఇబ్రహీంపట్నం: జిల్లా వ్యాప్తంగా ప్రైవేటు ఆస్పత్రులు పుట్టగొడుగుల్లా పుట్టుకొస్తున్నాయి. ప్రముఖ వైద్యుల పేరిట ఆస్పత్రులకు అనుమతులు తీసుకుని స్టాఫ్ నర్సులు, ఆర్‌ఎంపీలతో వైద్యశాలలు నెట్టుకొస్తున్నారు. అనుభవం, అర్హత ఉన్న డాక్టర్ల పేరుతో ఆస్పత్రులను నెలకొల్పి.. నర్సులు, సిబ్బంది చేత వైద్యం చేయిస్తున్నారు. డబ్బు సంపాదనే పరమావధిగా రోగుల ప్రాణాలతో చెలగాటమాడుతూ వైద్యం చేస్తున్న వారి భరతం పట్టాల్సిన అధికార యంత్రాంగం చూసీచూడనట్లుగా వ్యవహరిస్తోంది.

అక్రమార్జనే లక్ష్యంగా..

కోవిడ్ సమయంలో పలు ప్రైవేట్ ఆస్పత్రుల యాజమాన్యాలు ఇష్టానుసారంగా ఫీజులు వసూలు చేసి దోపిడీకి పాల్పడిన విషయం విదితమే. లింగనిర్ధారణ పరీక్షలు చేస్తూ డబ్బులు దండుకుంటున్న ఘటనలు వెలుగులోకి వచ్చాయి. ఫిర్యాదుల మేరకు జిల్లా వైద్యాధికారులు దాడులు చేసి స్కానింగ్ సెంటర్లు సీజ్ చేసినా అవి కొంత కాలానికే మళ్లీ తెరుచుకుంటున్నాయి. ఇటీవల ఓ చిల్డ్రన్స్ ఆస్పత్రిలో వైద్యం వికటించి బాలుడు మృతి చెందడంతో ఆ కుటుంబం విలవిలలాడింది.

వివాదాలకు కేరాఫ్ 'విజయలక్ష్మి'

ఇబ్రహీంపట్నంలోని విజయలక్ష్మి ఆస్పత్రి వివాదాలకు నిలయంగా మారింది. ఏడాదిన్నర క్రితం కుటుంబ నియంత్రణ ఆపరేషన్ చేయించుకున్న మహిళ గర్భందాల్చడంతో మళ్లీ ఆపరేషన్ చేసి డబ్బులు డిమాండ్ చేశారు. వారి బంధువులు ఆందోళనకు దిగడంతో అప్పట్లో డీఎంహెచ్ఓ ఆస్పత్రిని తనిఖీ చేసి చేతులు దులుపుకొన్నారే తప్ప చర్యలు తీసుకోలేదు. ఇదే ఆస్పత్రిలో సోమవారం డాక్టర్ అనూషరెడ్డి వాట్సాప్‌లో స్టాఫ్ నర్స్‌కు సూచనలిస్తూ ఎలిమినేడుకు చెందిన గర్భిణి కీర్తికి వైద్య చికిత్స చేసి గర్భస్థ పిండాల(మగ కవలలు) మృతికి కారణమైంది. వివాహమైన ఏడేళ్లకు పిల్లలు పుడుతున్నారనే సంతోషం ఆ కుటుంబానికి దూరం చేసింది. కీర్తి బంధువులు ఆందోళన చేపట్టడంతో డీఎంహెచ్ఓ వెంకటేశ్వరరావు విజయలక్ష్మి ఆస్పత్రిని తనిఖీ చేసి సీజ్ చేశారు.

అందుబాటులో ఉండని వైద్యులు

ప్రైవేట్ ఆస్పత్రులను స్థాపించిన వైద్యులు స్థానికంగా ఉండడంలేదు. వేరే ఆస్పత్రుల్లో పనిచేస్తూ రోజుకు ఓ రెండు గంటలపాటు వచ్చి వెళ్తున్నారు. పేషెంట్స్‌కు కండిషన్ సీరియస్ అయినప్పుడు వైద్యులు లేక ప్రాణాలు కోల్పోతున్నారు. ఆస్పత్రులు ఎవరి పేరిట ఏర్పాటు చేస్తున్నారో ఆ వైద్యులు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

బాధితురాలికి పరామర్శ

కడుపులోనే కవలలను పోగొట్టుకున్న ఎలిమినేడు గ్రామానికి చెందిన కీర్తి ఘటనపై జిల్లా వైద్యాధికారులు స్పందించి విజయలక్ష్మి ఆస్పత్రిని సీజ్ చేశారు. బాధితురాలు కీర్తిని చికిత్స నిమిత్తం నగరంలోని గాంధీ ఆస్పత్రికి తరలించారు. ఇబ్రహీంపట్నం సీఐ జగదీశ్ మంగళవారం గాంధీ ఆస్పత్రికి వెళ్లి కీర్తిని పరామర్శించి.. జరిగిన ఘటనపై విచారణ జరిపారు. వైద్య సిబ్బంది నిర్లక్ష్యంపై ఆమె సీఐకి వివరించారు. కాగా విజయలక్ష్మి ఆస్పత్రి వైద్యులు, సిబ్బంది పనితీరుపై జిల్లా వైద్యాధికారుల రిపోర్టు ప్రకారం చట్టపరమైన చర్యలు తీసుకుంటామని సీఐ జగదీష్ వెల్లడించారు.



గాంధీ ఆస్పత్రిలో కీర్తిని పరామర్శించి వివరాలు సేకరిస్తున్న సీఐ జగదీశ్



ఉత్తరాసిపల్లి రెవెన్యూ సదస్సులో కలెక్టర్ నారాయణరెడ్డి, పక్కన ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్, అధికారులు

ఇక భూ సమస్యలు ఉండొద్దు

- ప్రతీ సర్వేనంబర్ పరిశీలించి సరిచేయండి
- రెవెన్యూ సదస్సులో కలెక్టర్ నారాయణరెడ్డి

కొందుర్గు: భవిష్యత్‌లో భూ సమస్యలు ఉండకుండా అన్నీ సరిచేసుకోవాలని.. కొందర్గు మండలాన్ని ఆదర్శంగా నిలపాలని కలెక్టర్ నారాయణరెడ్డి అధికారులకు సూచించారు. మంగళవారం మండల పరిధిలోని శ్రీరంగాపూర్, ఉత్తరాసిపల్లి గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు నిర్వహించారు. ఈ రెవెన్యూ సదస్సుల నిర్వహణను కలెక్టర్ నారాయణరెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇకపై పొరపాట్లకు తావు లేకుండా చూసుకోవాలన్నారు. ప్రతీ సర్వే నంబర్ పరిశీలించి విస్తీర్ణంలో హెచ్చుతగ్గులు ఉంటే సరిచేయాలని సూచించారు. పట్టాదారు పాస్తుపుస్తకాల్లో తప్పులున్నా, భూములు సరిగ్గా రికార్డుల్లో లేకున్నా వినతిపత్రాలు ఇచ్చి సరిచేసుకోవాలని చెప్పారు. ప్రభుత్వం కల్పించిన ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్‌డీఓ సరిత, తహసీల్దార్లు రమేశ్ కుమార్, జగదీశ్వర్, కాంగ్రెస్ మండలాధ్యక్షుడు కృష్ణారెడ్డి, నాయకులు బాబర్‌ఖాన్, పురుషోత్తం రెడ్డి, రోహిత్ రెడ్డి, అంజిరెడ్డి, సయ్యద్ సాధిక్, మల్లేశ్ గౌడ్, జహంగీర్, వాజీద్ తదితరులు పాల్గొన్నారు.

స్వచ్ఛమైన తాగునీటిని అందించడమే లక్ష్యం

గ్రామస్తులకు స్వచ్ఛమైన తాగునీటిని అందించడమే తమ లక్ష్యమని షాద్‌నగర్ వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మెన్ సయ్యద్ సాధిక్ అన్నారు. ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్, సయ్యద్ సాధిక్, అశోక్ రెడ్డి సహకారంతో రూ.6.30 లక్షల ఖర్చుతో గ్రామంలో వాటర్‌ప్లాంట్ ఏర్పాటు చేశారు. ఈ మేరకు మంగళవారం కలెక్టర్ నారాయణరెడ్డి వాటర్‌ప్లాంట్‌ను ప్రారంభించి దాతలను అభినందించారు.

హైడ్రా వెబ్‌సైట్ సిద్ధం

సాక్షి, సిటీబ్యూరో: హైదరాబాద్ డిజాస్టర్ రెస్పాన్స్ అండ్ అసెట్ ప్రొటెక్షన్ ఏజెన్సీ (హైడ్రా) అధికారిక వెబ్‌సైట్ సిద్ధమైంది. గురువారం సీఎం రేవంత్‌రెడ్డి హైడ్రా పీఎస్‌తో పాటు వెబ్‌సైట్‌ను ఆవిష్కరించనున్నారు. అప్పటి నుంచే ఈ వెబ్‌సైట్ అందుబాటులోకి రానుంది. ఇందులో ఓఆర్‌ఆర్ పరిధిలోని చెరువులు, కుంటల ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్ వివరాలు ఉండనున్నాయి. భవిష్యత్తులో ప్రభుత్వ స్థలాలకు సంబంధించిన అంశాలను చేర్చనున్నారు. హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ మంగళవారం మేయర్ గద్వాల్ విజయలక్ష్మిని కలిశారు. హైడ్రా ఠాణా ప్రారంభోత్సవానికి రావాల్సిందిగా ఆహ్వానించారు. మరోపక్క సుప్రీం కోర్టు ఆదేశాల ప్రకారం ప్రతి పీఎస్ తాము నమోదు చేసిన కేసులకు సంబంధించిన ఎఫ్ఐఆర్‌లను ఆన్‌లైన్‌లో ఉంచాలి. ఇందుకు రాష్ట్ర పోలీసు అధికారిక వెబ్‌సైట్‌లో ప్రత్యేక విభాగం ఉంది. అందులో జిల్లాల వారీగా ఠాణాల పేర్లు ఉంటాయి. గురువారం హైడ్రా ఠాణా ప్రారంభం కానున్న నేపథ్యంలో దీన్నీ ఆ ఎఫ్ఐఆర్‌ల విభాగంలో చేర్చారు.



ఎల్లమ్మ తండాలో ఉపాధిహామీ కూలీలతో మాట్లాడుతున్న జాన్ వెస్లీ తదితరులు

ప్రజావ్యతిరేక విధానాలపై పోరాడాలి

- కలెక్టరేట్ ముట్టడిని విజయవంతం చేయాలి
- సీపీఎం రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ

మంచాల: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంబిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలపై పోరాడాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ అన్నారు. మంగళవారం ఆయన మండల పరిధిలోని ఎల్లమ్మ తండా గ్రామంలో ఉపాధిహామీ పథకంలో పనిచేస్తున్న కూలీలను కలిశారు. ఈ సందర్భంగా వారితో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. అనంతరం జాన్‌వెస్లీ మాట్లాడుతూ.. సీపీఎం పోరాటాల ఫలితంగానే అప్పటి కేంద్ర ప్రభుత్వం ఉపాధి హామీ పథకం తీసుకొచ్చిందన్నారు. నేటి ప్రభుత్వాలు ఉపాధి హామీ అమలులో విఫలమవుతున్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. పెరిగిన నిత్యావసర ధరలకు అనుగుణంగా దినసరి కూలీ.600కు పెంచి ఏడాదికి 200 రోజుల పనిదినాలు కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ పథకాన్ని ఎత్తివేసే కుట్రలో భాగంగా అలవెన్స్‌లు ఇవ్వడం లేదన్నారు. ఉపాధిహామీ కూలీలకు, ఫీల్డ్ అసిస్టెంట్లకు, టీఏ, ఏపీఓలకు సైతం నాలుగు నెలలుగా వేతనాలు ఇవ్వలేని దయనీయ పరిస్థితిలో ప్రజాపాలన సాగుతోందని ఆరోపించారు. ఆదివారం సైతం పనులు చేయిస్తూ శ్రమ దోపిడీకి పాల్పడుతున్నారని పేర్కొన్నారు. ఈ నెల 30న కార్మికుల హక్కులు, వారి సమస్యల పరిష్కారానికి కలెక్టరేట్ ముట్టడి కార్యక్రమం ఉంటుందని కార్మికులు, కర్షకులు కదలి వచ్చి విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. సీపీఎం జిల్లా కార్యదర్శి పగుడాల యాదయ్య మాట్లాడుతూ.. సీపీఎం పేదల పక్షాన పోరాడుతుందన్నారు. పేదలకు ఇళ్ల స్థలాలు, ఇందిరమ్మ ఇళ్లు, సంక్షేమ పథకాలు అందాలంటే సీపీఎం పోరాటాల్లో ప్రజలు భాగస్వామ్యం కావాలన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి జంగయ్య, జిల్లా నాయకులు సామేల్, జగదీష్, ఇ.నర్సింహ,వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు అంజయ్య, కె.జగన్, నాయకులు కె. శ్రీనివాస్‌రెడ్డి, కృష్ణ, శ్యాం సుందర్, పి.జగన్, జంగయ్య, యాదయ్య, బుగ్గ రాములు తదితరులు పాల్గొన్నారు.

మార్కెట్ ధరకు మూడు రెట్ల పరిహారం

- ఎవరికీ అన్యాయం చేయం
- జీవనోపాధి కోల్పోయిన వారికి ఆర్‌ఎన్‌ఆర్ ప్యాకేజీ
- కొంగరకలాన్ గ్రామసభలో అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్
- సర్వేసక్రమంగా చేపట్టడం లేదని రైతుల ఆగ్రహం

ఇబ్రహీంపట్నం రూరల్: ప్రజాభిప్రాయం మేరకే అధికారులు పని చేస్తారని.. పరిహారం విషయంలో ఎవరికీ జరగనీయమని ప్రభుత్వ నిర్ణయం మేరకు నడుచుకుంటామని అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్ అన్నారు. వంద మీటర్ల గ్రీన్ ఫీల్డ్ రేడియల్‌రోడ్డు ప్రాజెక్టు నిర్మాణం నిమిత్తం రావిర్యాల నుంచి మీరాఖాన్‌పేట వరకు 18 కిలోమీటర్ల రోడ్డు భూసేకరణ నష్టపరిహారం, పునరావస, పునరుపాధి కల్పనకు ఆదిబట్ల మున్సిపల్ పరిధిలోని కొంగరకలాన్‌లో గ్రామసభ నిర్వహించారు. భూసేకరణ శాఖ స్పెషల్ గ్రేడ్ డిప్యూటీ కలెక్టర్ ఆధ్వర్యంలో గ్రామసభ నిర్వహిస్తుండగా రైతులు అభ్యంతరం వ్యక్తం చేశారు. సర్వే సక్రమంగా లేదని మండిపడ్డారు. ప్రభుత్వం పటేళ్ల విషయంలో ఒక విధంగా గొల్లకుర్మల విషయంలో మరోలా వ్యవహరిస్తోందని ఆరోపించారు. ప్రభుత్వ భూములు వదిలి పట్టా భూములు ఎందుకు సేకరిస్తున్నారని నిలదీశారు. కబ్జాల్లో ఉన్న వారి పేర్లు జాబితాలో నమోదు చేయాలన్నారు. పొజిషన్‌లో ఉండి పేపర్లు లేని రైతులకు న్యాయం చేయాలన్నారు. ప్రశ్నించి సమావేశం నుంచి వెళ్లిన రైతులను అధికారులు మళ్లీ పిలిపించుకున్నారు.



గ్రామసభలో మాట్లాడుతున్న అడిషనల్ కలెక్టర్ ప్రతిమాసింగ్

ప్రభుత్వ నిర్ణయం మేరకే పని చేస్తాం: అడిషనల్ కలెక్టర్ ప్రతిమాసింగ్

గ్రీన్‌ఫీల్డ్ రోడ్డుకు జీవనోపాధి కోల్పోయిన వారికి ఆర్‌ఎన్‌ఆర్ ప్యాకేజీ ఇచ్చేందుకు ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. వారికి పునరావాసం కల్పించి ఉపాధి చూపుతుందన్నారు. ఇంటి యజమానితో పాటు ఇంట్లో 18 ఏళ్లు దాటిన వారి అందరికీ ఒక్కొక్కరికి రూ.5.50లక్షల చొప్పున చెల్లిస్తుందన్నారు. మార్కెట్ ధరకు మూడు రెట్లు పరిహారం ఇస్తామన్నారు. పబ్లిక్ ఇయరింగ్, డిక్లరేషన్ పూర్తవ్వగానే కలెక్టర్ పరిహారం ప్రకటిస్తారని చెప్పారు. రైతులు ఇబ్బందులు పడాల్సిన పరిస్థితి లేదన్నారు. అందరికి న్యాయం చేసే విధంగా చర్యలు చేపడతామన్నారు.

గ్రామసభ సమాచారం లేదు

గ్రామసభ పెడుతున్నట్లు రైతులకు సమాచారం లేదు, బహిరంగంగా టెంటు వేయకుండా పోలీసులను పెట్టుకుని లోపల గ్రామసభ పెట్టుకోవడం ఏమిటని భూసేకరణ అధికారి రాజును రైతులు నిలదీశారు. రైతులకు సమాచారం ఇవ్వాల్సింది పోయి ఒక్కరోజు ముందు సాయంత్రం నోటీసులు పెట్టడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. సమగ్ర సమాచారంతో సభలు పెట్టాలని కోరారు. ఈ కార్యక్రమంలో డీటీలు శ్రీనివాస్ ,విజయ్‌కుమార్, తేజేశ్వర్‌రెడ్డి, రైతులు పాల్గొన్నారు.



గ్రామసభపై సమాచారం ఇవ్వలేదంటూ అధికారులకు ఫిర్యాదు అందజేస్తున్న రైతులు

'కేన్స్'రైతులను ఆదుకోండి

సర్వే నెంబరు 300లో కేన్స్ సంస్థ కోసం భూములు కోల్పోయిన 11 మంది రైతులకు పరిహారం నేటికి అందలేదని, ఫాక్స్‌కాన్‌లోనూ ఇదే పరిస్థితి ఉందని కోశిక కోటయ్య, యాదయ్య అడిషనల్ కలెక్టర్ ప్రతిమాసింగ్‌కు చెప్పారు. వెంటనే వివరాలు ఇవ్వాలని ఆర్ఐ పుష్పలతకు సూచించారు. ఎక్కడ లోపం ఉంది, ఎందుకు పరిహారం రాలేదో పరిశీలించి చెబుతానన్నారు.

రోహింగ్యాలను వెనక్కి పంపండి



బాలాపూర్ ఠాణా ఎదుట ఆందోళన చేస్తున్న అందెల శ్రీరాములు యాదవ్ తదితరులు

- శరణార్థుల కార్డులు లేకుండానే నివాసం
- బాలాపూర్ పీఎస్ ఎదుట బీజేపీ నేతల ఆందోళన
- మహేశ్వరం డివిజన్ ఏసీపీ లక్ష్మీకాంతరెడ్డి హామీతో విరమణ

పహాడీషరీఫ్: బాలాపూర్ మండలంలో అక్రమంగా నివాసం ఉంటున్న రోహింగ్యాలను వెంటనే వెనక్కి పంపాలని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు, మహేశ్వరం నియోజకవర్గం ఇన్‌చార్జి అందెల శ్రీరాములు యాదవ్ డిమాండ్ చేశారు. మంగళవారం ఆయన పార్టీ శ్రేణులతో కలిసి జల్‌పల్లి మున్సిపల్ పరిధి రాయల్ కాలనీలో నివాసం ఉంటున్న రోహింగ్యాల క్యాంప్‌లను పరిశీలించారు. వారు ఎప్పుడొచ్చారు.?వారి వద్ద శరణార్థుల కార్డులున్నాయా.? అని పరిశీలించారు. అనంతరం బాలాపూర్ ఠాణా ఎదుట బైఠాయించి ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా అందెల మాట్లాడుతూ.. యూపీఏ సర్కార్ హయాంలో శరణార్థుల ముసుగులో వచ్చిన విదేశీయులు బాలాపూర్‌లో 20 వేల మంది వరకున్నారని.. వీరికి కార్డులు సైతం లేవన్నారు. ఆధార్, ఓటర్ ఐడీలు అక్రమంగా సంపాదించి సిమ్ కార్డులు, బైక్‌లు, కార్లు కొనుగోలు చేసి దర్జాగా ఉంటున్నారని మండిపడ్డారు. వీరికి మౌలిక సదుపాయాలు ఎందుకు కల్పిస్తున్నారో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి,ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ, మహేశ్వరం ఎమ్మెల్యే సబితా రెడ్డి సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. ఉదయం 5 గంటలకే నిద్రలేచే రోహింగ్యాలు హిందువుల బస్తీల్లో చెత్త సేకరించే వారిగా తిరుగుతూ,మన సమాచారాన్ని ఇతర దేశాలకు చేరవేస్తున్నారని ఆరోపించారు. భారత్ యుద్ధం మొదలుపెడితే మన పక్కనే ఉన్న వీరు మనపై దాడులకు తెగబడే ప్రమాదం ఉందన్నారు. వీరిని పంపించేందుకు హిందూ బంధువులంతా పార్టీలకతీతంగా స్పందించాలన్నారు. వీరి విషయంలో బాలాపూర్ పోలీసులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని, పూర్తి సమాచారంతో రాచకొండ పోలీస్ కమిషనర్‌ను కలుస్తామని ఆయన స్పష్టం చేశారు. 15 రోజుల్లో వీరిపై చర్యలు తీసుకునే ప్రయత్నం చేస్తామని మహేశ్వరం డివిజన్ ఏసీపీ లక్ష్మీకాంత రెడ్డి హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు.



నూతన కమిటీ సభ్యులకు నియామకపత్రం అందజేస్తున్న జాతీయ బీసీ సేన నాయకులు

హక్కుల సాధనకు ఐక్యంగా ఉద్యమిద్దాం

- జాతీయ బీసీ సేన జిల్లా ప్రధాన కార్యదర్శి సుధాకర్

షాద్‌నగర్‌రూరల్: హక్కులను సాధించుకునేందుకు బీసీలు ఐకమత్యంతో ఉద్యమించాలని జాతీయ బీసీసేన జిల్లా ప్రధాన కార్యదర్శి సుధాకర్ అన్నారు. మంగళవారం ఫరూఖ్‌నగర్ మండలం ఎలికట్ట పంచాయతీ పరిధిలోని మహల్‌ఎలికట్ట గ్రామంలో జాతీయ బీసీసేన మహిళా విభాగం మండల అధ్యక్షురాలు జలజ ఆధ్వర్యంలో బీసీసేన సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సమావేశానికి జాతీయ బీసీసేన జిల్లా ప్రధాన కార్యదర్శి సుధాకర్, నియోజకవర్గ అధ్యక్షురాలు బాసవరలక్ష్మి హాజరై మాట్లాడుతూ.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నిర్లక్ష్యంతో బీసీలు ఆర్థిక, రాజకీయ, సామాజిక రంగాల్లో వెనుకబడి ఉన్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అన్ని రాజకీయ పార్టీలు బీసీలను ఓటు బ్యాంకుగానే చూస్తున్నాయి తప్పితే సమస్యలను పట్టించుకోవడంలేదని విమర్శించారు. జనాభా దామాషా ప్రకారం రిజర్వేషన్లను అమలుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. బీసీలు గ్రామస్థాయి నుంచి జాతీయ స్థాయి వరకు ఐక్యంగా పోరాడాలని పిలుపునిచ్చారు. అనంతరం జాతీయ బీసీ సేన మహిళా విభాగం మండల కార్యదర్శిగా సరస్వతి, గ్రామ అడహక్ కమిటీ అధ్యక్షురాళ్లుగా పిట్టల మంజుల, పెరుమాళ్ల సువర్ణ, సుప్రమోని రేణుకను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అనంతరం నూతన కమిటీ సభ్యులకు నియామక పత్రాలను అందజేసి సన్మానించారు. ఈ కార్యక్రమంలో జాతీయ బీసీ సేన తాలుకా కార్యదర్శి చంద్రశేఖర్, మండల అధ్యక్షుడు వెంకటేష్, నాయకులు నర్సింలు, బాల్‌రాజ్, స్రవంతిరాజ్, మహిళలు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

ప్రహరీ పనులు ఆపేయండి


అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన తెలుపుతున్న మామిడిపల్లివాసులు

మామిడిపల్లివాసుల నిరసన

- సంఘీభావం ప్రకటించిన నాయకులు

పహాడీషరీఫ్: మామిడిపల్లి గ్రామం 99/1 సర్వే నంబర్‌లో హౌసింగ్ బోర్డు అధికారులు చేపట్టిన ప్రహరీ నిర్మాణ పనులను వెంటనే ఆపేయాలని మాజీ కౌన్సిలర్ ఈరంకి వేణుకుమార్‌గౌడ్, బీజేపీ సీనియర్ నాయకుడు పెరమోని నరేష్ యాదవ్ డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం అంబేద్కర్ విగ్రహం వద్ద దీక్ష చేపట్టిన గ్రామస్తులకు సంఘీభావం ప్రకటించారు. అనంతరం వారు మాట్లాడుతూ.. అంతర్జాతీయ విమానాశ్రయం నిర్మాణం కోసం మామిడిపల్లి రైతులు వందల ఎకరాల భూములు ఇచ్చారన్నారు. వీరిలో చాలా మందికి పరిహారం ఇవ్వలేదని తెలిపారు. రైతుల నుంచి సేకరించిన కొంత భూమిని టీజీఐఐసీకి కేటాయించారని, అందులో కంపెనీలు పెట్టి స్థానికులకు ఉపాధి కల్పిస్తామని చెప్పారని, ఇప్పటి వరకూ ఆచరణలోకి తేలేదని మండిపడ్డారు. 99/1 సర్వే నంబర్ భూమిలో మల్లన్నస్వామి, కొండ మైసమ్మ, రామాలయం, కాటమయ్యస్వామి, ఎల్లమ్మ దేవాలయాలు ఉన్నాయని తెలిపారు. వీటితో పాటు అంబేద్కర్ విగ్రహం, దోబీఘాట్, క్రీడా మైదానం, శ్మశానవాటిక ఉందన్నారు. వీటిలోకి వెళ్లకుండా చుట్టూ ప్రహరీ నిర్మించేందుకు అధికారులు చదును పనులు ప్రారంభించారని పేర్కొన్నారు. భూములను త్యాగం చేసిన రైతులతో పాటు గ్రామంలోని నిరుపేదలకు ఈ భూమిలో 60 గజాల ఇంటి స్థలం కేటాయించి, ఇందిరమ్మ ఇళ్లను నిర్మించి ఇవ్వాలని డిమాండ్ చేశారు. అంబేద్కర్ విగ్రహం నుంచి రంగనాయకులస్వామి ఆలయం వెలుపల వరకు ప్రహరీ పనులు నిలిపి వేయాలన్నారు. దాదాపు 20 ఎకరాల స్థలాన్ని గ్రామ అవసరాలకు కేటాయించాలన్నారు. రాజకీయాలతో సంబంధం లేకుండా ఈ విషయంలో ప్రభుత్వం స్పందించాలని కోరారు. అనంతరం వీరి దీక్షకు మాజీ కార్పొరేటర్ యాతం పవన్‌కుమార్ యాదవ్ కూడా మద్దతు తెలిపారు. కార్యక్రమంలో గ్రామస్తులు నందీశ్వర్, గుర్జని గణేశ్‌గౌడ్, అర్జున్, పురుషోత్తం, రాజు, లక్ష్మీపతి, నర్సింహ, జగన్, శ్రీకాంత్, మల్లేశ్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ‘అవంతి’ వార్షికోత్సవం

అబ్దుల్లాపూర్‌మెట్: గుంతపల్లి లోని అవంతి ఇంజినీరింగ్ కళాశాల వార్షికోత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఆ విద్యాసంస్థల చైర్మన్, ఏపీ మాజీ మంత్రి ముత్తంశెట్టి శ్రీనివాసరావు అధ్యక్షతన జరిగిన ఈ వేడుకలకు రాష్ట్ర ఉన్నత విద్యామండలి చైర్మన్ బాల కిష్టారెడ్డి, నవతేజా టెక్నాలజీస్ డైరెక్టర్ ఏరె సంగమ్కర్, అవంతి విద్యాసంస్థల ప్రధాన కార్యదర్శి డాక్టర్ ప్రియాంక హాజరై జ్యోతి ప్రజ్వలన చేశారు. అనంతరం విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలను తిలకించారు. కార్యక్రమంలో విద్యాసంస్థల డైరెక్టర్ డాక్టర్ జయప్రద, ప్రిన్సిపల్స్ శేషతల్పసాయి తదితరులు పాల్గొన్నారు.


వేడుకల్లో పాల్గొన్న ఉన్నత విద్యామండలి చైర్మన్ బాలకిష్టారెడ్డి

అంగన్‌వాడీ భవనాలకు మరమ్మతులు

జిల్లా సంక్షేమాధికారి శ్రీలత

ఇబ్రహీంపట్నం రూరల్: జిల్లాలో ఐసీడీఎస్ ప్రాజెక్టుల్లో ఉన్న అంగన్‌వాడీ భవనాలకు మరమ్మతులు చేపట్టాలని జిల్లా సంక్షేమాధికారి శ్రీలత పేర్కొన్నారు. మంగళవారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన ఐసీడీఎస్ సమీక్ష సమావేశంలో ఆమె మాట్లాడుతూ.. అంగన్‌వాడీ భవనాలకు మరమ్మతులు త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. శాఖలోని పలు అంశాలకు సంబంధించిన రివ్యూ చేపట్టాక అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు విధి నిర్వహణలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే సహించేది లేదన్నారు. పనితీరు మెరుగు పరుచుకోవాలన్నారు. జిల్లాని రాష్ట్ర స్థాయిలో ప్రథమ స్థానంలో నిలపడానికి అందరూ నిబద్ధతతో పని చేయాలన్నారు. బిహార్ రాష్ట్రానికి చెందిన ముగ్గురు బాల కార్మికులను రక్షించి సఖి–2 కేంద్రంలో అప్పగించిన నానాజీపూర్ టీచర్ సంధ్యారాణిని ప్రత్యేకంగా అభినందించారు.

పెద్దమంగళారంలో భారీ చోరీ

26 తులాల బంగారం, రూ.2.50 లక్షల నగదు అపహరణ

మొయినాబాద్: గుర్తుతెలియని దుండగులు ఇంట్లో బీరువా తాళాలు పగులగొట్టి బంగారం, నగదు దోచుకెళ్లారు. ఈ సంఘటన మొయినాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పెద్దమంగళారంకు చెందిన అప్పల హరీష్‌యాదవ్ సోమవారం రాత్రి 9 గంటలకు మొయినాబాద్‌లో ఉన్న తన అన్న సురేష్ ఇంటికి వెళ్లాడు. రాత్రి ఆలస్యం కావడంతో అక్కడే ఉన్నాడు. మంగళవారం ఉదయం 7 గంటలకు తిరిగి వెళ్లేసరికి ఇంటి తాళం కనిపించలేదు. లోపలికి వెళ్లి చూశాక బీరువా తాళాలు పగులగొట్టి తెరిచి ఉంది. అందులో ఉన్న 26 తులాల బంగారం, రూ.2.50 లక్షల నగదు కనిపించలేదు. రాత్రి సమయంలో దుండగులు తాళాలు పగులగొట్టి చోరీకి పాల్పడ్డారని పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఘటనా స్థలానికి పోలీసులు వెళ్లి పరిశీలించారు. క్లూస్ టీంను రప్పించి వేలి ముద్రలు సేకరించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

ఇంజెక్షన్ వికటించి మహిళ మృతి

డయాగ్నోస్టిక్ సెంటర్‌లో ఘటన

కేపీహెచ్‌బీకాలనీ: స్కానింగ్ కోసం వచ్చిన మహిళకు ఎక్కువ మోతాదు ఇంజెక్షన్ ఇవ్వడంతో గుండెపోటుకు గురై మృతి చెందిన సంఘటన కేపీహెచ్‌బీ పోలీస్‌స్టేషన్ పరిధిలో మంగళవారం చోటు చేసుకుంది. ఇన్‌స్పెక్టర్ రాజశేఖర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం ఖాజాగూడకు చెందిన శిష్టాల సూర్యలక్ష్మి (66) కొంతకాలంగా ముక్కుకు సంబంధించిన అనారోగ్యంతో బాధపడుతున్నారు. డాక్టర్లను సంప్రదించగా ముక్కుకు సి.టి స్కాన్ చేయించుకొని రావాల్సిందిగా సూచించారు. సూర్యలక్ష్మి కుమారుడు వెంకట అభిషేక్‌తో కలిసి మంగళవారం కేపీహెచ్‌బీకాలనీ, 4వ రోడ్డులోని మెడ్‌క్వెస్ట్ డయాగ్నొస్టిక్ సెంటర్‌కు స్కానింగ్ కోసం వచ్చారు. ఈ క్రమంలో స్కానింగ్ క్లియర్‌గా వచ్చేందుకు ఇచ్చే కాంట్రాస్ట్ ఇంజెక్షన్‌ను సూర్యలక్ష్మికి అక్కడి వైద్యులు ఇచ్చారు. దీంతో వెంటనే ఆమె గుండెపోటుకు గురై అపస్మారక స్థితిలోకి వెళ్లింది. హుటాహుటిన సమీపంలోని ఆసుపత్రికి తరలించగా ఆమె అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు ప్రకటించారు. దీంతో మెడ్‌క్వెస్ట్ డయాగ్నొస్టిక్ సెంటర్ సిబ్బంది అజాగ్రత్త, నిర్లక్ష్యంతోనే తన తల్లి మృతి చెందిందని ఆందోళన వ్యక్తం చేశారు. వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని మృతురాలి కుమారుడు అభిషేక్ కేపీహెచ్‌బీ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

‘లక్ష’ణమైన కాడెడ్లు!


మాల్ సంతకు క్రయ, విక్రయాలకు వచ్చిన కాడెద్దులు, పశువులు


మాల్ సంతలో మంగళవారం రూ.రెండున్నర లక్షలు పలికిన కాడెద్దుల జత

మాల్ సంతలో జోరుగా క్రయవిక్రయాలు

- వానాకాలం నేపథ్యంలో కొనుగోలుకు ఆసక్తి చూపిన రైతులు

యాచారం: మరో ఇరవై రోజుల్లో వానాకాలం సీజన్ ప్రారంభంకానుంది. ఈ నేపథ్యంలో కాడెడ్ల ధరలు భగ్గుమంటున్నాయి. వర్షాలు కురిస్తే ఇవి మరింతగా పెరిగే అవకాశం ఉంటుంది. దీంతో రైతులు మంగళవారం మాల్ సంతకు క్యూకట్టారు. ఆరడుగులకు పైగా ఎత్తున్న కాడెడ్లు ఇక్కడ అమ్మకానికి వచ్చాయి. ఎక్కువ విస్తీర్ణంలో వాణిజ్య పంటలు సాగు చేసే రైతులు పెద్ద ఎడ్లను కొనుగోలు చేసేందుకు ఆసక్తి చూపారు. పత్తి, మిర్చి, కంది పంటల్లో నిత్యం 10గంటలు పనిచేయగలిగే సామర్థ్యం వీటి సొంతం. కడుపు నిండా మేత, నీళ్లు ఉంటే అలసట లేకుండా పని చేస్తాయి. నల్గొండ జిల్లా హాలియా, దేవరకొండ, మిర్యాలగూడ, మర్రిగూడ తదితర ప్రాంతాల నుంచి భారీ సంఖ్యలో కాడెద్దులు విక్రయానికి వచ్చాయి. మాల్ పశువుల సంతలో ఒక్కో కాడెద్దుల జత రెండున్నర లక్షలకు పైగానే పలికింది. ఆరడుగులకు పైగా ఎత్తు, తెల్లటి రంగున్న కోడెలు, ఎద్దులు అందరి చూపులను ఆకర్షించాయి. ధృడంగా కనిపించిన వాటిని కొనుగోలు చేసేందుకు ఎక్కువ మంది మొగ్గు చూపారు. ఏపీలోని మాచర్ల, మార్కాపురం, నరసరావుపేట, చిలకలూరిపేట తదితర ప్రాంతాల్లోని రైతులు ఇక్కడకు వచ్చి కొనుగోలు చేసి తీసుకెళ్లారు. మోతుబరి రైతులు ధరను పట్టించుకోకుండా వారికి నచ్చినవి కొన్నారు.

25శాతం కబేళాకే

సాగుకు చేతకాని పశువులు, ఎద్దులతో పాటు వీటిని సాకలేని పలువురు రైతులు కబేళాకు విక్రయించారు. మంగళవారం సంతకు వచ్చిన మూగజీవాల్లో సుమారు 25శాతం కబేళాకే తరలిపోయాయి. నగరానికి చెందిన వ్యాపారులు వీటిని కొనుగోలు చేసి తీసుకెళ్లారు. వయసు పైబడిన వాటిలో ఎక్కువగా వీరే కొనుగోలు చేశారు.

వృద్ధుల బాధ్యత వారసులదే


సమావేశంలో రెడ్‌క్రాస్ సొసైటీ పాండుగౌడ్‌ను సన్మానిస్తున్న సీనియర్ సిటిజన్స్

సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు మధుసూదనరావు

మొయినాబాద్‌రూరల్: వయోవృద్ధుల పోషణ, సంక్షేమం చట్టపరంగా వారి పిల్లలే చూసుకోవాలని సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు మధుసూదనరావు, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు కొంపల్లి అనంతరెడ్డి పేర్కొన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని అంజనాదేవి గార్డెన్స్‌లో సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ సమావేశాన్ని డాక్టర్ వి.పాండుగౌడ్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మధుసూదనరావు, అనంతరెడ్డిలు హాజరై మాట్లాడారు. తల్లిదండ్రులు, వయోవృద్ధుల పోషణ సంక్షేమ చట్టం–2007, నియమావళి రూల్స్ 2011ను వివరించారు. డాక్టర్ పాండుగౌడ్ మాట్లాడుతూ.. ఇండియన్స్ రెడ్ క్రాస్ సొసైటీ ద్వారా సీనియర్ సిటిజన్స్‌కు ఆరోగ్య సమస్యలపై అవగాహన కల్పిస్తున్నామని తెలిపారు. అందరం కలిసి పేద కుటుంబాల ప్రజలకు సహాయం అందించాల్సిన బాధ్యత ఉందన్నారు. ప్రతి గ్రామంలో సంఘాలు ఏర్పాటు చేయాలని చట్టం 2007 అందరికీ అవగాహన కల్పించాలని సూచించారు. సమావేశంలో ఉపాధ్యక్షులు సత్తయ్య, నాయకులు ఉపేందర్ రెడ్డి, అనంతరెడ్డి, భాస్కర్, రమేశ్, చంద్రలింగం, సంగరి మల్లేశ్, గోపాల్‌రెడ్డి, మల్లారెడ్డి, కిషన్, రామ్మోహన్, సుగుణాకర్‌రావు, సయ్యాజీరావు, బల్వంత్‌రెడ్డి, కృష్ణారెడ్డి, రవీందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

లారీని ఢీకొన్న డీసీఎం

ఇరుక్కుపోయి డ్రైవర్‌కు తీవ్ర గాయాలు


ప్రమాదానికి గురైన డీసీఎం

నందిగామ: ముందు వెళ్తున్న లారీని వెనకాల నుంచి డీసీఎం అతివేగంగా ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో డీసీఎం డ్రైవర్‌కు తీవ్రగాయాలయ్యాయి. ఈ సంఘటన మండల పరిధిలోని 44వ నంబరు జాతీయ రహదారి(బైపాస్)పై మంగళవారం తెల్లవారుజామున చోటుచేసుకుంది. సీఐ ప్రసాద్ కథ నం ప్రకారం.. మహారాష్ట్రలోని నాందేడ్ జిల్లాకు చెందిన షేక్ అన్సార్‌కు చెందిన డీసీఎంపై అదే గ్రా మానికి చెందిన షేక్ జావేద్ డ్రైవర్‌గా పనిచేస్తున్నా డు. సోమవారం రాత్రి మహబూబ్‌నగర్ జిల్లాలోని జడ్చర్లకు మామిడికాయలను తీసుకెళ్లడానికి డీసీఎం అక్కడి నుంచి బయలుదేరింది. మంగళవారం ఉదయం నందిగామ పరిధిలోని 44వ నంబరు జాతీయ రహదారిపై పెట్రోల్ పంపు సమీపంలో రాగానే డ్రైవర్ జావేద్ డీసీఎంను అతివేగంగా నడిపిస్తూ ముందు వెళ్తున్న తమిళనాడుకు చెందిన లా రీని వెనకాల నుంచి ఢీ కొట్టాడు. ఈ ప్రమాదంలో డీసీఎం లారీ వెనకభాగంలో ఇరుక్కుపోయి అందు లో జావేద్ చిక్కుకున్నాడు. స్థానికులు, పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని క్రేన్ సహాయంతో డీసీఎంను తొలగించి డ్రైవర్‌ను కాపాడారు. అనంతరం క్షతగాత్రుడిని చికిత్స నిమిత్తం శంషాబాద్‌లోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. ఈ మేరకు లారీ యజమాని షేక్ అన్సార్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఇన్‌స్పెక్టర్ తెలిపారు.

సబ్‌రిజిస్ట్రార్‌పై దాడి అమానుషం

తీవ్రంగా ఖండించిన గెజిటెడ్ అధికారుల సంఘం

ఇబ్రహీంపట్నం రూరల్: విధి నిర్వహణలో ఉన్న పెద్దఅంబర్‌పేట్ సబ్‌రిజిస్ట్రార్‌పై దాడి చేయడం అమానుషమని గెజిటెడ్ అధికారుల సంఘం జిల్లా అధ్యక్షుడు రామారావు, కార్యదర్శి శ్రీనేష్ కుమార్ నోరీలు పేర్కొన్నారు. ఈ మేరకు మంగళవారం స్టాంప్స్, రిజిస్ట్రేషన్ శాఖ సెక్రెటరీ బుద్ధ ప్రకాష్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. సబ్‌రిజిస్ట్రార్‌పై దాడికి పాల్పడిన వ్యక్తిని వెంటనే జైలుకు పంపించాలన్నారు. ప్రభుత్వ ఉద్యోగులు తమ విధి నిర్వహణ ప్రకారం పని చేస్తారన్నారు. అధికారులు తప్పు చేస్తే ఫిర్యాదులు చేయాలి కాని, భౌతిక దాడులకు పాల్పడటం తగదని హెచ్చరించారు. గెజిటెడ్ ఉద్యోగులు కలెక్టరేట్ నందు నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపినట్లు చెప్పారు. దోషులను కఠినంగా శిక్షించే వరకు ఉరుకోబోమని తెలిపారు. కార్యక్రమంలో స్టాంప్స్, సబ్‌రిజిస్ట్రార్ సంఘం బాధ్యులు సహదేవ్, స్థితి ప్రజ్ఞ, వెంకటేష్, నూతనగంటి వెంకట్, శాంతి శ్రీ, అలివేలు, లక్ష్మణ్ స్వామి, సుజాత, సైదమ్మ, నాగేశ్వర్‌రావు, సీడీపీఓ, ఈఈఎస్, డీఈఈఎస్, కలెక్టరేట్ గజిటెడ్, నాన్ గెజిటెడ్ సిబ్బంది, అధికారులు పాల్గొన్నారు.


స్టాంప్స్ రిజిస్ట్రేషన్ శాఖ కమిషనర్ బుద్ధ ప్రకాష్‌కు వినతిపత్రం అందజేస్తున్న సబ్ రిజిస్ట్రార్లు

ప్రేమ విఫలమై యువకుడి ఆత్మహత్య

జీడిమెట్ల: ప్రేమ విఫలమై ఓ యువకుడు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్న సంఘటన జీడిమెట్ల పీఎస్ పరిధిలో చోటు చేసుకుంది. ఇన్‌స్పెక్టర్ గడ్డం మల్లేష్ వివరాల ప్రకారం..కుత్బుల్లాపూర్ చెరుకుపల్లి కాలనీకి చెందిన ఇస్తార్ రాణి కుమారుడు డానియేల్(19) ప్రైవేట్ ఉద్యోగం చేస్తున్నాడు. కాగా సోమవారం డానియేల్ తల్లి శుభకార్యం నిమిత్తం బయటకు వెళ్లి తిరిగి మంగళవారం ఉదయం 6 గంటలకు ఇంటికి వచ్చింది. తలుపులు లోపలి నుండి గడియపెట్టి ఉండటంతో డానియేల్‌ను పిలవగా ఎంతకూ తలుపులు తీయలేదు. దీంతో అనుమానం వచ్చి వెంటిలేటర్ నుండి చూడగా డానియేల్ చున్నీతో ఉరి వేసుకుని వేలాడుతూ ఉన్నాడు. చుట్టు పక్కల వారి సహాయంతో తలుపులు తెరచి చూడగా అప్పటికే డానియేల్ మృతిచెంది ఉన్నాడు. మృతుడు ఇన్‌స్టాలో పరిచయమైన అమ్మాయితో తరచూ మాట్లాడేవాడని, ప్రేమ విఫలమై చనిపోయి ఉండవచ్చని మృతుని తల్లి పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

బైక్‌ను ఢీకొన్న లారీ: కూలీ మృతి

శంషాబాద్ రూరల్: కూలి పనికి వెళ్తూ ఓ వ్యక్తి రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. మండలంలోని నర్కూడ శివారులో మంగళవారం బైక్‌ను రెడీమిక్స్ లారీ ఢీకొనడంతో ఈ సంఘటన చోటు చేసుకుంది. ఇన్‌స్పెక్టర్ కె.నరేందర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. మొయినాబాద్ మండలం నాగిరెడ్డిగూడ వాసి గంగపాక అర్జున్ (50) ఉదయం పని కోసం బైక్‌పై శంషాబాద్ వెళ్తున్నాడు. నర్కూడ చేరుకోగానే ఎదురుగా వచ్చిన రెడీ మిక్స్ లారీ ఇతని బైక్‌ను ఢీకొంది. ఈ ప్రమాదంలో అర్జున్‌కు తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. మృతదేహాన్ని ఉస్మానియా ఆస్పత్రి మార్చురీకి తరలించారు. పోలీసులు ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

దిగుబడి తగ్గకుండా..

- మేలైన యాజమాన్య పద్ధతులతో వేసవిలోనూ లాభాల పంట
- కృషి విజ్ఞాన కేంద్రం క్రీడా నిపుణుడు జి.శ్రీకృష్ణ




పందిరి విధానంలో తీగజాతి పంట

కందుకూరు: అధిక ఉష్ణోగ్రతలు, పొడి గాలులు, జల వనరులు తగ్గడం, విద్యుత్ సరఫరాలో అంతరాయం వంటి కారణాలతో వేసవి కాలంలో కూరగాయల దిగుబడి ఆశించిన స్థాయిలో ఉండదు. ఫలితంగా రైతులు నష్టపోతుంటారు. ఈ సమస్యలను అధిగమించి, ఎండల్లో కూడా మంచి దిగుబడులు సాధించడానికి మేలైన యాజమాన్య పద్ధతులను పాటించాలని కృషి విజ్ఞాన కేంద్రం క్రీడా నిపుణుడు జి.శ్రీకృష్ణ తెలిపారు. వేసవిలో కూరగాయల సాగుపై ఆయన రైతులకు పలు సలహాలు, సూచనలు అందించారు.

అనువైన పంటలు

టమాటా, వంగ, బెండ, పచ్చి మిర్చి, సొర, కాకర, బీర, కూరదోస, పొట్ల, గోరు చిక్కుడు, చేమ, కంద, ముల్లంగి, తోటకూర, పాలకూర పంటలు వేసవిలో సాగు చేసుకోవచ్చు.

మొక్కల సాంద్రత పెంచడం

- వేసవిలో అధిక ఉష్ణోగ్రతలతో మొక్క పెరుగుదల తక్కువగా ఉండి, పూత, పిందె తగ్గి దిగుబడులు తగ్గుతాయి.
- మొక్కలను తక్కువ దూరంలో నాటుకుని మొక్కల సాంద్రత పెంచాలి. దీంతో విడిగా ఒక్కో మొక్క నుంచి దిగుబడి తగ్గినప్పటికీ, ఎక్కువ మొక్కలు ఉండటంతో మొత్తం విస్తీర్ణంలో దిగుబడి తగ్గకుండా ఉంటుంది. ఇందు కోసం విత్తన మోతాదు పెంచాలి.

ఎరువుల యాజమాన్యం

- సమగ్ర పోషక యాజమాన్యం పాటిస్తే భూభౌతిక లక్షణాలు మారడమే కాకుండా సూక్ష్మపోషకాలు కూడా లభ్యమవుతాయి.
- సేంద్రియ ఎరువులను ఎక్కువగా వాడితే భూమిలో తేమను నిలిపి ఉంచే గుణం పెరగడమే కాకుండా, సూక్ష్మ జీవుల చర్యలు అధికమై మొక్కలకు పోషకాల లభ్యత పెరుగుతుంది.
- జీవన ఎరువులైన అజిటోబాక్టర్, అజోస్పైరిల్లిం, పాస్ఫోబాక్టీరియాను ఎకరానికి 2 కిలోల చొప్పున వాడటంతో సిఫారుసు చేసిన నత్రజని, భాస్వరం ఎరువుల్లో 25 శాతం ఆదా చేయవచ్చు.
- 30, 45, 75 రోజులకు 2శాతం యూరియా ద్రావణాన్ని పిచికారీ చేస్తే నత్రజని ఆదాతో పాటు నీటి ఎద్దడిని తట్టుకునే వీలుంది.
- పొటాష్‌ను సరైన మోతాదులో వాడితే నీటి ఎద్దడిని, చీడపీడలను తట్టుకునే గుణం పెరుగుతుంది.
- 9 కిలోల యూరియాకు ఒక కిలో వేప పిండిని కలిపి వేయాలి. లేదా 25 కిలోల యూరియాకు ఒక కిలో వేప నూనెను కలిపి అరగంట సేపు ఆరబెట్టి పంటకు అందించాలి.
- జింక్, బోరాన్, కాల్షియం, మెగ్నీషియం మొదలైన సూక్ష్మధాతు లోపాలు కనిపించే అవకాశం ఉంది.
- మిరప, చేమ పంటల్లో ఎకరాకు 20 కిలోల జింక్ సల్ఫేట్ దుక్కిలో వేయాలి లేదా లీటరు నీటికి 2కిలోల జింక్ సల్ఫేట్ కలిపి మిరపలో పూతకు ముందు పది రోజుల వ్యవధిలో పిచికారీ చేయాలి.
- 3 గ్రాముల బోరాక్స్‌ను లీటరు నీటికి కలిపి పూత, పిందె సమయంలో వారం రోజుల వ్యవధిలో రెండుసార్లు స్ప్రే చేయాలి.
- బ్లాజమ్‌ఎండ్ రాట్ అనగా కాయ తొడిమ వద్ద నల్లగా మారే సమస్య నివారణకు కాల్షియం నైట్రేట్ 5 గ్రా. లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలి.

వేసవి తాపాన్ని తట్టుకునేలా..

- నేల ఉష్ణోగ్రత తగ్గించడానికి వరుసల మధ్య ఎండుగడ్డి, రంపపుపొట్టు, వరి పొట్టు, పశువుల ఎరువు మొదలైనవి పరచాలి.
- టమాటాలో పాక్షికంగా నీడనిచ్చే విధంగా ఆముదం, మొక్కజొన్నలాంటి పంటలను ఉత్తర, దక్షిణ దిశల్లో నాటు కోవాలి. లేదా 35 శాతం షేడ్ నెట్‌లను ఏర్పాటు చేస్తే ఎండ తీవ్రత తగ్గి దిగుబడులు పెరుగుతాయి.
- పండ్ల తోటల్లో సొర, దోస, గుమ్మడి, బెండ, గోరుచిక్కుడు వంటి కూరగాయలను అంతర పంటలుగా సాగు చేసి అధిక ఆదాయాన్ని పొందవచ్చు.
- తుంపర పద్ధతిలో నీరు ఇవ్వడంతో నీటి ఆదాతో పాటు ఎండవేడి తగ్గి మంచి దిగుబడులు పొందవచ్చు.
- సూక్ష్మపోషకాలు, హార్మోన్లు చల్లి పూత రాలడాన్ని అరికట్టాలి. ఫలితంగా మంచి లాభాలు ఆర్జించే అవకాశం ఉంది.